## ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



# భస్మాసుర 'హస్తం'

- రైతులు బాగుపడడాన్ని ఓర్చుకోలేక పోతున్న హస్తం పార్టీ
- అందుకే రేవంత్ 'మూడు గంటల కరెంట్' పాట
- 10హెచ్‌పీ మోటర్లు పెట్టాలని కల్లబొల్లి మాటలు
- ధరణి ఎత్తేస్తే మళ్లీ భూ పంచాయితీలు మొదలు
- కాంగ్రెస్‌పై రైతాంగం కన్నెర్ర.. ఓటుతో బుద్ధి చెబుతామని హెచ్చరిక
- రైతు నేస్తం కేసీఆర్‌కే మా మద్దతు అని ప్రకటన

## వ్యవసాయాన్ని ఆగం జేసేందుకు కాంగ్రెస్ కుట్ర



### మూడు గంటల కరెంట్ సరిపోతదా?

కాంగ్రెస్ ఇస్తామన్న మూడు గంటల కరెంట్ వ్యవసాయానికి సరిపోతదా ? రైతులు 10 హెచ్‌పీ మోటర్లు కొనాలంటే లక్ష రూపాయలకుపైగా ఖర్చవుతుంది. మళ్లీ అప్పులు కావాల్సి వస్తుంది. ఒకప్పుడు కాంగ్రెస్ పాలనలో కరెంట్ కోసం ఎన్నో కష్టాలు పడ్డాం. ఇప్పుడు సీఎం కేసీఆర్ రైతుల కోసం 24 గంటల కరెంటు ఇస్తున్నారు. రైతులంతా సంతోషంగా వ్యవసాయం చేస్తున్నారు. అయితే ఇప్పుడు ఓట్ల కోసం కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావాలని డ్రామాలాడుతున్నది. రైతులు ఎవ్వరూ కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మరు. రైతుబంధు, రైతుబీమా ఇస్తున్న సీఎం కేసీఆర్‌కే రైతులు అండగా ఉంటారు.

**- వెంకటేశ్వరెడ్డి,రైతు, హంగర్గాఫారం, పొతంగల్ మండలం**

### కరెంట్ కష్టాలు తప్పవు...

సీఎం కేసీఆర్ మా కష్టాలను గుర్తించి ఇబ్బందులు లేకుండా చేశారు. 24 గంటలు కరెంట్‌తో పాటు రైతుబంధు, రైతురుణమాఫీ చేస్తున్నారు. కాంగ్రెస్ నాయకుడు రేవంత్‌రెడ్డి రైతులకు కేవలం 3 గంటల కరెంట్ సరిపోతుందని అనడం సిగ్గుచేటు.10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకుంటే దాదాపు రూ.లక్ష ఖర్చు వస్తుంది. కాంగ్రెస్ పార్టీకి పొరపాటున ఓటు వేసి మళ్లీ కష్టాలు కొనితెచ్చుకోవద్దు.

**- శ్యాంరావు,రైతు హెగ్డోలి, పొతంగల్ మండలం**



### రేవంత్‌రెడ్డికి దిమాక్ ఖరాబ్ అయింది

చందూర్, నవంబర్ 24 : కాంగ్రెస్ హయాంలో అరిగోస పడ్డాం. బీఆర్‌ఎస్ గవర్నమెంటు అచ్చినంకనే ఎవుసం దారిల వడుతున్నది. మళ్లా కొత్తగా రేవంత్‌రెడ్డి మూడు గంటల కరంటు, 10హెచ్‌పీ మోటర్లు అంటున్నడు. ఆయన దిమాక్ ఖరాబ్ అయింది. మూడు గంటలు కరంటు సరిపోతదా? ఎవుసానికి ఎవ్వళ్లన్న 10హెచ్‌పీ మోటర్లు వెడుతరా? మళ్లా మా బతుకలల్ల చిచ్చువెడతామంటే సూసుకుంట ఉంటామా?

**- అర్కల సాయరెడ్డి, చందూర్**



### కాంగ్రెసోళ్లకు ఓట్లతోటి బుద్ధి చెప్తాం

అప్పట్ల రాత్రి పూట కరెంటు తోటి పొలం కాడనే పండుకొని పొద్దుగాళ్ల ఇంటికి వచ్చేటోడ్ని. ఇంటికి అచ్చేదాక ఇంటోళ్లకి భయం ఉంటుండె. కేసీయార్ సర్కార్ అచ్చినంక 24 కరెంట్‌తోటి పొద్దుగాళ్ల పూటనే నీళ్లు పారిచ్చి అస్తున్నా. మళ్లా ఈ ఎన్నికల లొల్లి రాంగానే 10 హెచ్‌పీ మోటర్ పెడతా, మూడు గంటల కరెంటు ఇస్తా అని రైతులకు ఆగం చేస్తే రేపు ఓట్లతో కాంగ్రెసోళ్లకు బుద్ధి చెబుతాం.

**-పోతారెడ్డి, మోస్రా**







### కాంగ్రెసోళ్లు అస్తే మళ్లా పంటలు ఎండగొడ్తరు..

గత ప్రభుత్వాలు విద్యుత్ సక్కగ ఇయ్యక పంటలు ఎండిపోవాటుండె. సీఎం కేసీఆర్ ఎక్కినంక 24గంటల కరెంటు ఇస్తుండ్రు. గిప్పుడు నేను కూరగాయలు పండించి నా కుటుంబాన్ని పోషించుకుటున్నా. మళ్లా కాంగ్రెస్ గిన అచ్చిందంటే కంరెంటు ఇయ్య చేతగాక మా పంటలు ఎండగొడ్తరు.. మా కడుపుల మట్టిగొడ్తరు. ఎవుసం బంద్ చేసుకునుడయితది. మంచిగ కరంటు ఇస్తున్న బీఆర్‌ఎస్ పార్టీకే అచ్చే ఎలచన్ల ఓటు వేస్తాం.

**- బానోత్ లచ్చ్య, తగిలేపల్లి.**




### మూడు గంటలతో కరువు పరిస్థితులే

నా చిన్ననాటి నుంచి వ్యవసాయం చేస్తున్నా. కాంగ్రెసోళ్లు ఉన్నప్పుడు కరెంటు కోసం పడరాని పాట్లు పడ్డాం. ఇప్పుడిప్పుడే వ్యవసాయం పండుగలా మారుతున్నది. ఇప్పుడు మళ్లా కొత్తగా 3 గంటల కరెంట్ సరిపోతుందని , 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని కాంగ్రెసోళ్లు అంటుండ్రు. 10 హెచ్‌పీ మోటరు పెట్టుడంటే ఉట్టిగనే అయితదా. ఒక వేళ పెట్టినా భూమిలో నీళ్లన్నీ ఒక్కదెబ్బకు ఇంకిపోతాయి. మళ్లా కరువు పరిస్థితులు వస్తాయి. అసలు రైతుల బాధ వారికి తెలిస్తే ఇలాంటి పిచ్చి కూతలు కూయరు. రైతు పడే బాధ ఏందో వారు చూసి ఉండరు. రైతులను ఆగం చేయాలని చూస్తే ఊరుకోం.

**-కుమ్మరి బాబు, చందూర్**